క్లుప్తంగా

'ముత్యాల'కు మరోసారి వైఎస్సార్ సీపీ మండల సారథ్యం



కొత్తపేట: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షునిగా ముత్యాల వీరభద్రరావు మరోసారి నియమితులయ్యారు. క్రియాశీలక కార్యకర్తగా, పార్టీ మండల అధ్యక్షునిగా అంకిత భావంతో పని చేస్తున్న ఆయన పేరును స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి మరోసారి సిఫారసు చేశారు. దీంతో ముత్యాలకు అధిష్టానం పార్టీ మండల బాధ్యతలు అప్పగించింది. మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముత్యాలకు అభినందనలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకాన్ని ఉంచి, మరోసారి ఈ పదవిలో నియమించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఈ సందర్భంగా వీరభద్రరావు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని అన్నారు. పార్టీ ప్రతినిధులుగా పని చేయడం తమకు గర్వకారణమని చెప్పారు. జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాల అమలుకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ సహకారం అందించాలని ముత్యాల కోరారు.

వెంకటేశ్వరరావుకు సత్కారం



పి.గన్నవరంలో వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షునిగా తిరిగి నియమితులైన నక్కా వెంకటేశ్వరరావును నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన పి.గన్నవరంలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు దొమ్మేటి వెంకట శివరామన్, సర్పంచ్‌లు తోలేటి బంగారు నాయుడు, వడలి కొండయ్య, తోరం సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమాజానికి మేలుకొలుపు కత్తిమండ రచనలు



ప్రతాప్‌ను సన్మానిస్తున్న తులసీ భాస్కరరావు తదితరులు

మలికిపురం: ప్రముఖ కవి కత్తిమండ ప్రతాప్ రచనలు సమాజానికి మేలుకొలుపు అని బహుజన సమన్వయ కమిటీ అధ్యక్షుడు గెడ్డం తులసీ భాస్కరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవల బోయి భీమన్న సాహిత్య పురస్కారం అందుకున్న శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండకు స్థానిక పూలే అంబేద్కర్ భవనంలో గురువారం ఘనంగా సన్మానం జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో భాస్కరరావు ప్రసంగించారు. దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు రొక్కాల వెంకట్, నక్కా రమేష్, నల్లి శివకుమార్, రాపాక మహేష్, గొల్లమందల చిట్టిబాబు, కొల్లాబత్తుల అశోక్, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

అనారోగ్యంపై అలసత్వం వద్దు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోగంతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిపై నిర్లక్ష్యం చేయకుండా తగిన వైద్యం చేయించుకోవాలని అంబాజీపేట వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. వాకలగరువు సచివాలయంలో సీహెచ్ఓ బి.అప్పారావు ఆధ్వర్యాన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సుమారు 70 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో లేవలేని స్థితిలో ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి, వారిని పరీక్షించి, తగు సలహాలు, సూచనలు అందించారు. నందంపూడి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆప్తాల్మిక్ అధికారి ప్రభాకర్ కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏలు సుభాషిణి, జీవీఎస్‌వీ ప్రసాద్, డీఈఓ రాజకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ వసంత, ఏఎన్ఎం జయంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంజిలే కర్బలాలో మజ్లిస్

మామిడికుదురు: మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా హజరత్ ఇమామ్ రజా సోదరి మాసుమాయే ఖుమ్ షహదత్‌ను పురస్కరించుకుని నగరం మంజిలే కర్బలాలో గురువారం మజ్లిస్ జరిగింది. అంజుమనే పర్వానే హుస్సేన్ భక్త బృందం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. మత ప్రబోధకులు అత్తర్ అబ్బాస్ జైదీ మజ్లిస్ ఆలపించారు. అనంతరం హజరత్ ఇమామ్ హుస్సేన్ గుర్రంతో పాటు గుమ్మటాన్ని ఊరేగించారు. హుస్సేన్, హుస్సేన్ అని నినదిస్తూ, గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. గురుహే మొహిబ్బానే మాసుమయే ఖుమ్ ఆధ్వర్యాన మామిడికుదురు ఇమామ్ అలీ రజా పంజాలో కూడా మజ్లిస్ జరిగింది. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని హజరత్ ఇమామ్ హుస్సేన్ పరివారంతో పాటు మాసుమాయే ఖుమ్‌కు నివాళులర్పించారు.



అయినవిల్లి: పుష్పాలంకరణలో విఘ్నేశ్వర స్వామి



అంబాజీపేట: గంధం అలంకరణలో దర్శనమిస్తున్న వినాయకుడు



మామిడికుదురు: పెదపట్నంలంకలో వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఆత్రేయపురం: కాలువలో సంచరిస్తున్న మొసలి

ముచ్చటగా 3 రోజులు

- కొన్ని ప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలు
- అంగరంగ వైభవంగా ఊరేగింపులు
- పలుచోట్ల కొనసాగుతున్న నవరాత్ర ఉత్సవాలు
- పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన అయినవిల్లి విఘ్నేశ్వరుడు



పి.గన్నవరం: బూరుగులంకలో వినాయకుని విగ్రహాలను వశిష్ట గోదావరిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు

మామిడికుదురు/పి.గన్నవరం/అయినవిల్లి/అంబాజీపేట/ఆత్రేయపురం: చవితి ఉత్సవాల్లో భాగంగా అనేకచోట్ల నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ముచ్చటగా మూడు రోజుల ఉత్సవాల అనంతరం గురువారం గణేశ నిమజ్జనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీన్‌మార్ నృత్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నడుమ వినాయకుడిని ఊరేగించి, ఆ స్వామిని పినతల్లి గంగమ్మ ఒడికి చేర్చారు.

- మామిడికుదురు మండలం పెదపట్నంలంక దేవీ సెంటర్‌లో శ్రీ వరసిద్ధి వినాయకుని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అప్పనపల్లి, సాకావారిపేట, మొల్లేటివారిపాలెం ప్రాంతాల్లో కూడా వినాయకుడి విగ్రహాలను వైభవంగా ఊరేగించారు. గ్రామ వీధుల్లో ఊరేగించిన అనంతరం గణేశుని విగ్రహాలను పావన వైనతేయ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. పెదపట్నంలంక దేవీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయకుని చేతిలో ఉంచిన 5 కిలోల లడ్డూను స్థానిక భక్త బృందం వేలం పాటలో రూ.19 వేలకు దక్కించుకుంది. అదే విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మూడు కిలోల లడ్డూను బండారు సతీష్ అనే భక్తుడు రూ.15 వేలకు పాడుకున్నాడు.
- పి.గన్నవరం మండలంలోని జి.పెదపూడి శివారు బూరుగులంకలో స్థానిక యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను వశిష్ట గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. తొలుత వినాయకుని ఉత్సవ విగ్రహాలను బాణసంచా కాల్పుల నడుమ బ్యాండు మేళాలతో గ్రామంలో కోలాహలంగా ఊరేగించారు. అనంతరం నదిలో నిమజ్జనం చేశారు. ముంగండ గ్రామంలో ఏర్పాటు చేసిన బాల గణపతి స్వామి వారికి ఎంపీపీ అంబటి భూలక్ష్మి, కోటేశ్వరరావు దంపతులు పూజలు చేశారు. అనంతరం విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- అయినవిల్లి విఘ్నేశ్వరుడు విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. లక్ష గరిక పూజ చేశారు. స్వామివారిని సాయంత్రం మాడ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. పంచహారతులు ఇచ్చారు. స్వామి వారిని దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో వేచి ఉండి మరీ విఘ్నేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.
- అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద వేంచేసిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారిని గంధపు పూతతో అలంకరించారు. గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా స్వామివారికి అర్చకుడు మర్ల వెంకట శ్రీనివాసశర్మ ఈ అలంకరణ చేశారు. కె.పెదపూడి, పుల్లేటికుర్రు, గంగలకుర్రు మలుపు, జి.అగ్రహారం, తొండవరం, ఇసుకపూడి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కూడా గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో వేంచేసియున్న గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్రేయపురం చిన్న రామాలయం, పెద్ద రామాలయం, కాలువ రేవు సెంటర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ఆ విఘ్నాధిపతికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వినాయక చవితి ఉత్సవాల్లో నిబంధనలకు లోబడి వ్యవహరించాలని ఎస్సై బీవై కిరణ్ కుమార్ అన్నారు. కాలువల్లో మొసళ్లు సంచరిస్తున్నందున గణేశ నిమజ్జనాల సమయంలో గోదావరి, ప్రధాన కాలువల వద్ద భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి గోదావరిలో దిగరాదని సూచించారు. ఊరేగింపులకు ఉత్సవ నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఊరేగింపులు శాంతియుతంగా నిర్వహించాలని, నిర్వహణ తేదీలను ముందుగా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, సాంస్కృతిక కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. అనధికారికంగా ఏ ఒక్కరూ బాణసంచా తయారీ చేయరాదని ఎస్సై కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి



రోగులకు టోకెన్లు ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ

మామిడికుదురు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంపై పాశర్లపూడి-2 సచివాలయంలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ముందుగా సర్వే చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని గుర్తించి, వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసే శిబిరంలో సేవలందిస్తారని చెప్పారు. సదస్సులో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు అంకాని వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్య పరీక్షలు

సఖినేటిపల్లి: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా రామేశ్వరం-2 సచివాలయ పరిధిలో పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ప్రతి ఇంటినీ సందర్శించి, మ్యాపింగ్ చేశారు. ఆ ఇంట్లో ఎవరు, ఎటువంటి అనారోగ్య సమస్యతో బాధ పడుతున్నారో గుర్తించే సర్వే చేపట్టారు. దీనిని జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు ప్రారంభించారు. రోగుల వివరాలను యాప్‌లో నమోదు చేసి, సిద్ధం చేసిన టోకెన్లను వారు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ కె.గంగాధరరావు, ఎంపీహెచ్ఎస్ (ఎం) కె.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్(ఎఫ్) డి.లలిత కుమారి, సిల్వియా, కరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



లాంగ్‌జంప్ చేస్తున్న క్రీడాకారుడు

కొత్తపేట: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి, పీడీ ఏఎస్ఎస్ రమాదేవి గురువారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో 100 నుంచి 600 మీటర్ల పరుగు పందెం, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, రిలే, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రో తదితర పోటీలను అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన 46 మంది బాలికలను, 50 మంది బాలురను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకూ కాకినాడ, అనపర్తి తదితర ప్రాంతాల్లో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారు.

నేడు ఎలుకల సామూహిక నిర్మూలన

కొత్తపేట/అంబాజీపేట/అయినవిల్లి/సఖినేటిపల్లి: వరి పంటను ఎలుకల బారి నుంచి కాపాడుకోవడానికి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నారు. దీనిని వ్యవసాయ సిబ్బంది, రైతులు సమష్టిగా విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ కొత్తపేట సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకట రామారావు కోరారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై ఆయన గురువారం క్షేత్ర స్థాయిలో పర్యటించి, వీఏఏలకు, రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరూ ఒకేసారి ఈ కార్యక్రమం చేపట్టడం ద్వారా ఎలుకలను నిర్మూలించవచ్చని, తద్వారా పంటను రక్షించుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో 22,695 ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు 95 కేజీల బ్రోమోడయోలిన్ మందు సరఫరా చేశామని చెప్పారు. ఈ మందును రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) వారీగా వీఏఏలకు పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లోనూ రైతులతో వీఏఏలు సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించాలని సూచించారు.

- వరి, ఇతర పంటలను నాశనం చేస్తున్న ఎలుకలను సామూహికంగా నివారించేందుకు రైతులు సహకరించాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు అన్నారు. అంబాజీపేట మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పి.గన్నవరం మండలంలో 2,971 హెక్టార్లకు 32 కిలోలు, అంబాజీపేట మండలంలో 1,694 హెక్టార్లకు 18 కిలోలు, మామిడికుదురు మండలంలో 1,584 హెక్టార్లకు 18 కిలోల చొప్పున బ్రోమోడయోలిన్ మందును రైతులకు అందించనున్నామని వివరించారు. మొత్తం 6,249 హెక్టార్లకు 68 కిలోల మందును ఉచితంగా అందిస్తామని చెప్పారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం పర్యవేక్షకులుగా వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి డిప్యూటీ డైరెక్టర్ రానున్నారని రామ్మోహనరావు తెలిపారు.
- సామూహిక ఎలుకల నివారణపై గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులకు అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి వై.శోభ అవగాహన కల్పించారు.
- సఖినేటిపల్లి సత్తిరేవు పుంత వద్ద బళ్ల రామకృష్ణ వ్యవసాయ క్షేత్రంలో ఎలుకల సామూహిక నివారణపై మండల వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు అవగాహన కల్పించారు. ఎలుకల నివారణ మందు వినియోగించే విధానాన్ని వివరించారు. వీఏఏ, వీహెచ్ఏ, ఏఈఓలతో క్షేత్ర సందర్శన నిర్వహించారు. వరి రైతులకు బ్రోమోడయోలిన్ మందు ఉచితంగా పంపిణీ చేశారు. విషపు ఎర 100 గ్రాముల తయారీకి 96 గ్రాముల వరి నూకలు, 2 గ్రాముల నూనె, బ్రోమోడయోలిన్ పొడి మందు 2 గ్రాముల చొప్పున కలుపుకోవాలని రైతులకు సూచించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

సఖినేటిపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల కమిటీ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శృంగవరప్పాడులో మణికుమారి వృద్ధుల ఆశ్రమంలో గురువారం దివ్యాంగుల సమావేశం జరిగింది. పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని, దివ్యాంగుల కుటుంబాలకు 35 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేయాలని కోరారు. తొలుత వికలాంగుల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ విభిన్న ప్రతిభావంతులు రాష్ట్ర ప్రతినిధి బందెల కిరణ్‌రాజ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

జీసీఎస్‌లను సందర్శించిన ఎస్పీఎఫ్ కమాండెంట్



మోరిలోని ఓఎన్‌జీసీ జీసీపీలో ఎస్పీఎఫ్ కమాండెంట్ నరసింహారావు

సఖినేటిపల్లి/ఆలమూరు: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) కమాండెంట్ కె.నరసింహారావు గురువారం జిల్లాలో పర్యటించారు. విజయవాడ నుంచి ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. తొలి పర్యటనలో భాగంగా ఆలమూరు - మండపేట రోడ్డులోని పెదపళ్లలోని ఓఎన్‌జీసీ గ్యాస్ కలెక్షన్ స్టేషన్(జీసీఎస్)ను, రాజోలు దీవిలోని మోరి, అడవిపాలెం జీసీఎస్‌లలోని గ్యాస్ కంప్రెషన్ ప్లాంట్ల(జీసీపీ)ను సందర్శించారు. ఆయనకు ఆయా ప్లాంట్లలో అధికారులు ఘన స్వాగతం పలికారు. మోరి ఓఎన్‌జీసీ సైటులో ఎస్పీఎఫ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మోరి, పెదపళ్ల సైట్లలో మొక్కలు నాటారు. ప్లాంట్ల భద్రతపై ఓఎన్‌జీసీ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీఎఫ్ సిబ్బంది పనితీరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, ఏపీ సచివాలయం, శాసన సభ, హైకోర్టు, విమానాశ్రయాలు, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, నగదు నిల్వ కేంద్రాలతో పాటు తిరుపతి, విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం వంటి ప్రధాన దేవాలయాలకు, ఓఎన్‌జీసీకి, ప్రముఖులకు, ప్రభుత్వ ఆస్తులకు ఎస్పీఎఫ్ భద్రత కల్పిస్తోందని వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీఓ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. పెదపళ్లలో ఆయనను సిబ్బంది ఘనంగా సత్కరించారు.

డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పరిశీలన



రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న న్యాక్ బృందం

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం బుధ, గురువారాల్లో పరిశీలించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి గురువారం ఈ విషయం తెలిపారు. ప్రొఫెసర్ వజీర్ సింగ్ లత్రా చైర్మన్‌గా, ప్రొఫెసర్ మానస్ పాండే కో ఆర్డినేటర్‌గా, ప్రొఫెసర్ మైత్రేయీ బర్దన్‌రాయ్ సభ్యునిగా ఉన్న త్రిసభ్య కమిటీ కళాశాలలోని వివిధ విభాగాల విద్యా ప్రమాణాలను 2017 నుంచి 2022 కాలానికి సంబంధించి పరిశీలించింది. పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో విడివిడిగా సమావేశమైంది. కళాశాల అభివృద్ధికి సూచనలు, సలహాలు అడిగి తెలుసుకుంది. ఫిజికల్ ఎడ్యుకేషన్, గ్రంథాలయం, ఎన్ఎస్ఎస్, జేకేసీ, వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, కళాశాల క్యాంటీన్, వసతులు, విద్యా ప్రమాణాలను పరిశీలించింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాశాల అభివృద్ధికి ఈ కమిటీ పలు సూచనలు చేసిందని ప్రిన్సిపాల్ జ్యోతి చెప్పారు. బెంగళూరులోని కేంద్ర కార్యాలయానికి ఈ కమిటీ నివేదిక పంపిస్తుందని, అనంతరం కళాశాలకు న్యాక్ గ్రేడింగ్ ఇస్తారని తెలిపారు.

జిల్లా సైన్స్ సెమినార్‌లో తొండవరానికి తృతీయ స్థానం



మెమెంటో, సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు

అంబాజీపేట: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూలులో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో తొండవరం జెడ్పీ హైస్కూల్ తృతీయ స్థానం కైవసం చేసుకుంది. హెచ్ఎం పీవీ కేశవాచార్యులు గురువారం ఈ విషయం తెలిపారు. తృణ ధాన్యాలు విశేష ఆహారమా వ్యామోహపూరిత ఆహారమా అనే అంశంపై పాఠశాల విద్యార్థులు సైన్స్ సెమినార్ నిర్వహించారన్నారు. ఇందులో 65 పాఠశాలల నుంచి 65 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారని తెలిపారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కందాల గణేష్ నరసింహారావు పర్యవేక్షణలో తమ విద్యార్థులు సోము అవినాష్, నాగాబత్తుల ప్రియాంక ప్రదర్శించిన ఈ అంశానికి జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి లభించిందని చెప్పారు. వారు డీఈఓ ఎం.కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీవీ సుబ్రహ్మణ్యంల చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్లు అందుకున్నారన్నారు. ఆ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుడిని ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తదితరులు అభినందించారు.

కుండపోత



అప్పనపల్లిలో ప్రధాన రోడ్డుపై నిలిచిన వాన నీరు

మామిడికుదురు: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉదయం నుంచీ ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది. ముంపు నీరు కాలనీలను ముంచెత్తింది. మామిడికుదురు రెండో వీధిలో ప్రధాన రహదారిపై మూడడుగుల మేర నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి బి.దొడ్డవరం - పెదపట్నంలంక ఆర్అండ్‌బీ రోడ్డు మరింత దెబ్బ తింది. ఈ రోడ్డుపై పలుచోట్ల భారీగా నీరు నిలిచిపోయింది. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో 216వ నంబర్ జాతీయ రహదారిపై వాన నీరు భారీగా చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, మొగలికుదురు, గెద్దాడ తదితర గ్రామాల్లో కూడా ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. మామిడికుదురు ఆల్‌క్యాస్ట్ కాలనీ, మొగలికుదురు వీవర్స్ కాలనీ, పాశర్లపూడి బాడవ సత్తరువుతోట కాలనీ, మాకనపాలెం కాలనీల్లో భారీగా ముంపు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

హౌసింగ్ రుణాలకు దరఖాస్తులు ఇవ్వండి : ఎమ్మెల్యే కొండేటి



మామిడికుదురు: సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద రుణాల కోసం శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల జాబితాను గృహ నిర్మాణ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. దరఖాస్తులను ఆయా గృహ నిర్మాణ శాఖ అధికారుల కార్యాలయాల్లో అందజేయాలని చిట్టిబాబు కోరారు.

రూ.3 లక్షల రుణం ఇస్తామని.. రూ.38 వేలు కాజేశారు

అయినవిల్లి: ఆన్‌లైన్‌లో రుణం ఇస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, రూ.38 వేలు కాజేశాడని ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. తొత్తరమూడి గ్రామానికి చెందిన నామాడి వాసుదేవరావుకు ఈ నెల 13వ తేదీన ఆన్‌లైన్ ద్వారా లోన్ ఇస్తామంటూ ఓ కాల్ వచ్చింది. ముందుగా రూ.38 వేలు చెల్లిస్తే రూ.3 లక్షల రుణం ఇస్తామని అవతలి వ్యక్తి నమ్మబలికాడు. అది నమ్మిన వాసుదేవరావు రెండు విడతలుగా రూ.38 వేలు ఫోన్‌పే చేశాడు. అయితే రుణం కావాలంటే మరో రూ.29 వేలు పంపించాలని అవతలి వ్యక్తి డిమాండ్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన వాసుదేవరావు మోసపోయానని గుర్తించి, పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉచిత బీమాపై అవగాహన

సఖినేటిపల్లి: అప్పనరామునిలంకలో వైఎస్సార్ సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు ఉచిత బీమాపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సూచనల మేరకు జగనన్న కన్వీనర్ల సారథి (జేసీఎస్) మండల ఇన్‌చార్జి నల్లి మోహన్ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ వీరా మల్లిబాబుతో కలసి ఆయన గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు ఉచిత బీమా నమోదు దరఖాస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, పార్టీ మండల ఉపాధ్యక్షురాలు పెదపాటి నాగమణి, గ్రామ శాఖ అధ్యక్షుడు బర్రే రాము తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆరాధ్య దైవం బలరాముడు

అంబాజీపేట: రైతులందరి ఆరాధ్య దైవం బలరాముడేనని బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల జమ్మీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొక్కా ఆదినారాయణ అన్నారు. మాచవరం శివారు పోతాయిలంక బీకేఎస్ కార్యాలయం వద్ద గురువారం బలరామ జయంతి ఘనంగా నిర్వహించారు. అర్చకుడు కల్యాణ్‌శర్మ ఆధ్వర్యాన వెంకట స్వామినాయుడు, పద్మావతి దంపతులతో బలరాముని విగ్రహం వద్ద హల, గో, బలరామ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎంఆర్‌పీఎస్ నాయకుల అరెస్టు

రావులపాలెం: ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలంటూ మంద కృష్ణమాదిగ పిలుపు నేపథ్యంలో గురువారం ముగ్గురు ఎంఆర్‌పీఎస్ నాయకులను అరెస్టు చేసినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. ముమ్మిడివరప్పాడుకు చెందిన కాపా నాగరాజు, తొత్తరమూడి శ్రీనివాస్‌ను హౌస్ అరెస్టు చేయగా, జిల్లా నాయకుడు వల్లూరి సత్తిబాబును ముందస్తు అరెస్టు చేశామని వివరించారు.

వైద్యానికి సాయం

రావులపాలెం: కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన పిల్లి మురళీకృష్ణ కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాడు. అలాగే అతడి కాలికి ఇన్ఫెక్షన్ వచ్చింది. పేదలు కావడంతో వైద్యానికి ఆ కుటుంబం అవస్థలు పడుతోంది. విషయాన్ని స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితికి వారు తెలిపారు. సమితి సభ్యులు గురువారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు.